# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గురువారం 24 ఆగస్టు 2023


## స్వచ్ఛమైన ఓటరు జాబితాను తయారుచేయాలి



పీలేరు, ఆగస్టు 23 ప్రభాతవార్తః

2023-24 సంవత్సరానికి గాను స్వచ్ఛమైన వాటరు జాబితాను సిద్ధం చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోపాలకష్ణ అన్నారు. బుధవారం స్థానిక తహాశీల్దారు కార్యాలయంలో ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఓటరు జాబితాలో ఊరు వదిలి వెళ్లిపోయినవారు, పెళ్లైనవారు, చనిపోయిన వారి పేర్తు తొలగించాలని సూచించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ తహాశీల్దారులు, వివిద రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు .

## అంగన్వాడి సెంటర్‌కు తాళాలు వేస్తానంటూ బెదిరింపు

వార్త IIవ పేజీలో

## ఏపీలో కడపకు విమాన సర్వీసులు నలిపివేస్తామంటున్న ఇండిగో

### కలెక్టర్ చొరవతో విమాన సర్వీసులు కొనసాగింపు

కడప కార్పొరేషన్, ఆగస్టు 23 ప్రభాతవార్త

కడపకు విమాన సర్వీసులు నిలిపివేస్తామని ఇండిగో సంస్థ పేర్కొనింది. ఏపీ ప్రభుత్వం బకాయి నిధులు ఇవ్వని కారణంగా నిలిపి వేస్తున్నట్లు ప్రకటించింది. ఏపీ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఇండిగో సంస్థ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ఏటా రూ.20 కోట్లు ఇండిగో సంస్థకు చెల్లిస్తామని ఒప్పందం చేసుకోగా ఆ నిధులు ఇవ్వకపోవడంతో ఇండిగో సంస్థ సెప్టెంబర్ 1 నుండి విమాన సర్వీసులు నిలిపివేయాలని భావిస్తుంది. ఇప్పటికే టికెట్ల విక్రయం ఇండిగో సంస్థ ఆపేసింది.

కలెక్టర్ చొరవతో విమాన సర్వీసులు కొనసాగింపు..

ఏపీ ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.20 కోట్ల విజిఎఫ్ ఫండ్ నిలిచిపోవడంతో ఇండిగో విమానయాన సంస్థ కడపకు విమాన సర్వీసులు ఆపేస్తామంటూ టికెట్ల జారీని నిలిపివేసింది. సమాచారం అందుకున్న కలెక్టర్ విజయరామరాజు నిధుల విడుదలకు సంభవించిం చర్యలు తీసుకుంటామని ఇండిగో ప్రతినిధులకు హామీ ఇచ్చారు. దీంతో సెప్టెంబర్ 15 వరకు టికెట్లను అందుబాటులో ఉంచుతూ ఇండిగో నిర్ణయం తీసుకుంది. పరిస్థితిని బట్టి ఇండిగో తదుపరి నిర్ణయం వెల్లడించనుంది.

# అన్నమయ్య జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం

### జిల్లా పరిధిలోని సమస్యలు కలెక్టరే పరిష్కరిస్తారు - రాష్ట్రస్థాయి సమస్యల పరిష్కారం నా బాధ్యత

### జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి - ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

### కలెక్టర్ గిరీషా హెచ్చరిక






రాజంపేట - కోడూరు నియోజకవర్గాల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, సమీక్ష సమావేశంలో పాల్గొన్న రెండు నియోజకవర్గాల అధికారులు

రాజంపేట అర్బన్, ఆగస్టు 23 ప్రభాతవార్త

నూతనంగా ఏర్పాటు అయిన అన్నమయ్య జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఇదే ఉద్ధేశ్యంతో ఉన్నారని, అందుకు తగినట్లుగా అధికారులు ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుని పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ సభాభవన్‌లో రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల అభివృద్ధిపై మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందేలా చేయడంలో అధికారుల పాత్ర కీలకమన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతోనే నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కోరారు. అధికారుల పనితీరును బట్టే ప్రభుత్వం చేపట్టిన పనులు త్వరగా పూర్తయి పాలకపక్షానికి మంచిపేరు వస్తుందన్న విషయాన్ని మరవకూడదన్నారు. జిల్లా స్థాయిలో సమస్యలు పరిష్కారానికి కలెక్టర్ చూసుకుంటారన్నారు. ఎప్పటికప్పుడు శాసన సభ్యులు, అధికారులు సమస్యల పరిష్కారం కోసం నిధుల కేటాయింపులకు సంబంధించి కలెక్టర్‌తో సమన్వయం చేసుకుని ముందుకు పోవాలన్నారు. రాష్ట్రస్థాయి సమస్యలను పరిష్కరించడం తన బాధ్యత అని ముఖ్యమంత్రి సిఎస్ దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రాజంపేట పట్టణంలో విద్యుత్తు లైన్లు అధ్వాన్నంగా ఉన్నాయని, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కోరారు. పోలి వద్ద ముంపు నివాసుల కోసం సిద్ధం చేసిన స్థలంలో జగనన్న లేఅవుట్ నిబంధనల ప్రకారమైన ముంపు నిర్వాసితులకు స్థలాలు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. ఇందుకు సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నాయని, కలెక్టర్‌కు కూడా ఆ విషయాలు తెలుసు అని, మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. రాజంపేట మున్సిపాలిటిలో ఒక్కో సచివాలయానికి 2 కోట్లు చొప్పున నిధులు మంజూరు చేస్తామని చెప్పారని, ఆ నిధులను త్వరగా మంజూరయ్యేలా చూడాలని మంత్రిని కోరారు. అందుకు మంత్రి స్పందిస్తూ రాజంపేట పట్టణంలో భూగర్భ విద్యుత్తు కేబుల్ వేసేలా అంచనాలు సిద్ధం చేసి ఇవ్వాలని విద్యుత్తుశాఖ మంత్రి చర్చించి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. నీటిపారుదలశాఖ ఎస్ఇ కృష్ణమూర్తి మాట్లాడుతూ అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణ పనులు టెండర్లు పూర్తయ్యాయని, ప్రస్తుతం ఇన్విస్టిగేషన్ పనులు జరుగుతున్నాయని వివరించారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యానవన పంటల పరిహారానికి సంబంధించి ప్రస్తావించారు. జగనన్న లేఅవుట్‌లో మౌళిక వసతులు కల్పించాలని కోరారు. నాడు నేడు పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఎమ్మెల్యే నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వరద బాధిత ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ నాడు నేడు పనుల కింద కొన్ని పాఠశాలలు ఎంపిక చేయలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఇందుకు సంబంధించిన ఫైలును తనకు పంపాలని కలెక్టర్‌ను ఆదేశించారు. రాజంపేట ఏరియా ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండడం లేదని ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. సుండుపల్లెలో 6 పడకల ఆసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ పర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్‌డిఒ జి.రామక్రిష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా హక్కు చట్టానికి తూట్లు...

### నిబంధనలు బేఖాతర్..!!

### మామూళ్ల మత్తులో అధికారులు...!!!



రాయచోటి, ఆగస్టు 23 ప్రభాతవార్త :

రాష్ట్రవ్యాప్తంగా 6 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలందరికీ ఉచిత విద్య అందించాలన్నది విద్యా హక్కు చట్టం ప్రధాన ఉద్దేశం 2009లో ఈ చట్టాన్ని అమలులోకి తెచ్చారు పాలకుల నిర్లక్ష్యం అధికారుల పర్యవేక్షణ లోపంతో ఈ చట్టానికి తూట్లు పడుతున్నాయి పేద విద్యార్థులకు ఉచితంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్య అందించాలన్న చట్టం నిబంధనలు అన్నమయ్య జిల్లాలో ఎక్కడ అమలు జరగడం లేదని ఆరోపణలు ఉన్నాయి. అమలయ్యేలా చూడాల్సిన విద్యాశాఖ అధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు అంతేకాక కార్పొరేట్ ప్రైవేట్ యాజమాన్యాలకి వత్తాసు పలుకుతున్నారు నిబంధనలకు వ్యతిరేకంగా రోజురోజుకు పుట్టగొడుగుల్లా పాఠశాలలు వెలుస్తున్నాయి అధికారులు మామూళ్లు పుచ్చుకొని వారికి అనుమతులు మంజూరు చేస్తూ ఈ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు

**అమలు కాని నిబంధనలు**

ప్రతి ప్రవేట్ పాఠశాలలోనూ విద్య హక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలి. అలా ఇవ్వకుండా వేలాది రూపాయలు ఫీజు గుంజుతో కొంతమందికి ఉచితంగా సీట్లు ఇస్తున్నట్లు దొంగ లెక్కలు చూపుతున్నారు ప్రవేశ పరీక్షలు నిర్వహించకుండా లాటరీ పద్ధతిన సీట్లు కేటాయించాల్సి ఉండగా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తూ మార్కులు రాలేదన్న నెపముతో ఫీజులు వసూలు చేస్తున్నారు క్యాపిటేషన్ ఫీజు సాంస్కృతిక కార్యక్రమాల ఫీజు పరీక్షల ఫీజులు అంటూ రకరకాల పేర్లతో వేలకు వేలు గుంజుతున్నారు.

**మౌలిక వసతుల కల్పనేది..!**

విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో విధిగా మౌలిక వసతులు కల్పించాలి కానీ ఎక్కడ వసతులు అందుబాటులో లేవు పక్కా భవనం గాలి వెలుతురు ఉండేలా విశాలమైన తరగతి గదులు క్రీడా మైదానం క్రీడా పరికరాలు లైబ్రరీ ప్రయోగశాల ప్రహరీ అర్హత కలిగిన ఉపాధ్యాయులు పిఈటి సిబ్బంది తాగునీరు తదితర మౌలిక సదుపాయా లు కల్పించాల్సి ఉన్నా వీటిలో సగం సదుపాయాలు కూడా ఉండడం లేదు చిన్నపాటి భవనాలు ఇరుకు చీకటి గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు నిబంధనలు పాటించకపోయినా అగ్నిమాపక అధికారులు అనుమతులు ఇస్తున్నారు. ఏ ఒక్క పాఠశాలకు క్రీడా మైదానం అందుబాటులో లేదు వ్యాయామ ఉపాధ్యాయులు సగానికి పైగా లేరు

**కానరాని యాజమాన్య కమిటీలు..!**

తల్లిదండ్రులతో పాఠశాల యాజమాన్యాల కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఏర్పాటు చేయడం లేదు డమ్మీ కమిటీలు చూపించి సమావేశాలు నిర్వహించకుండానే కాలం వెళ్లదీస్తున్నారు ఎవరైనా తల్లిదండ్రులు సమస్యలపై ప్రశ్నిస్తే వారి పిల్లలను వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

## ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందించడమే జగన్ ప్రభుత్వ లక్ష్యం

### ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా



కడప కార్పొరేషన్, ఆగస్టు 23 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికి పని చేస్తూ ప్రతి ఇంటికి సంక్షే పథకాలు అందించడం జరుగుతోందని ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ అన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా 2/2 వ డివిజన్ రాజారెడ్డి వీధి సచివాలయం-2 లోని రాజారెడ్డి వీధి వద్ద గల పలు ప్రాంతాలలో పర్యటన. స్థానిక 22/2 వ డివిజన్ రాజారెడ్డి వీధి లో పలు ప్రాంతాలను సందర్శించారు. బుధవారం స్థానిక 27/2 డివిజన్ కార్పొరేటర్ ఈ. రామచంద్రయ్య ఇంఛార్జి ఆధ్వర్యంలో సచివాలయం-2 పరిధిలోని రాజారెడ్డి వీధి ప్రాంతంలోని రామాలయం వీధి నుండి పలు వీధులు, ప్రాంతాలలో లిగడప గడపకూ మన ప్రభుత్వం'' కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తొలుత రామాలయం వీధి వద్ద నుండి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా ప్రారంభించారు. అలాగే 22/2 డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ ఈ. రామచంద్రయ్య ఇంచార్జి గడప గడపకూ మన ప్రభుత్వం'' కార్యక్రమం పూలమాలలు వేసి, స్వాగతం పలికి ఘనంగా నిర్వహించినందులకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా అభినందించారు. 107 వ రోజైన గడప గడపకు మన ప్రభుత్వం'' కార్యక్రమంలో భాగంగా ఉపముఖ్యమంత్రికి అభిమానులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని ఉపముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు.స్థానిక కార్పొరేటర్, నాయకులు, అధికారులతో కలిసి.. ఆయా వీధుల్లో నివాసాలన్నింటినీ తిరిగారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి తోపాటు కార్పొరేటర్ రామచంద్రయ్య ఇంఛార్జి, సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్ కుమార్, మార్కెట్ యార్డు ఛైర్మన్ బంగారు నాగయ్య యాదవ్, కార్పొరేటర్లు షేక్ మహమ్మద్ షఫీ, బాలస్వామి రెడ్డి, వైకాపా నాయకులు అఫ్జల్ ఖాన్, నారపురెడ్డి సుబ్బారెడ్డి, ఎన్ఆర్ఐ తోట కృష్ణ, హాజరత్ పీరాన్ మున్నా, పవర్ అల్తాఫ్, అహమ్మద్, పస్తం అంజి పాల్గొన్నారు.

## గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

### ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



పులివెందుల, ఆగస్టు 23, ప్రభాతవార్త :

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. వేముల మండలంలోని వి.కొత్తపల్లెలో దాదాపు రూ.1.50కోట్ల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లను బుధవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనీల్‌కుమార్‌రెడ్డి, వేముల మండల వైకాపా కన్వీనరు నాగేళ్ల సాంబశివారెడ్డి, వేముల జడ్పీటీసీ సభ్యుడు కోగటం వెంకట బయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవి, వెంకట నారాయణ, పీసీబీ రాష్ట్ర సభ్యుడు మరకా శివక్రిష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ చందా లీలావతి, సర్పంచి గంగరాజులతో కలిసి ప్రాంభించారు. అంతకుముందు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాలయంలో ఎంపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ఎడ్డి గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి ఇంటి వద్దకు పాలన తీసుకువచ్చి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజాన్ని జగనన్న సాకారం చేశాన్నారు. జగనన్న అమలు చేస్తున్న పథకాలతో ఆంధ్రరాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అనంతరం ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేముల మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాజారెడ్డి, ఓబుళరెడ్డి, డీఈఈలు రవిచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఏడీ శ్రీకాంత్, ఎంపీడీవో విజయరాఘవరెడ్డి, తహసీల్దారు వెంకట సుబ్బయ్య, ఎంపీపీ భర్త చల్లా వెంకట నారాయణ, మాజీ ఎంపీటీసీ మల్‌రెడ్డి, రామాంజనేయులు, విజయభాస్కర్‌రెడ్డి, వ్యవసాయాధికారి చెన్నారెడ్డి, ఆర్.కె.వ్యాలీ సీఐ గోవిందారెడ్డి, వేముల ఎస్సై ధనుంజయుడు, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## ఆంధ్ర కేసరి టంగూటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తిదాయకం

### కలెక్టర్ విజయ్ రామరాజు



కడప, ఆగస్టు 23 ప్రభాతవార్త :

ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తిదాయకం, ఆదర్శప్రాయుడని ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసు కోవాలని, తమ పిల్లలకు కూడా కష్టపడి క్షుణ్ణంగా తెలుసుకొని ముందుకు వెళ్లే విధంగా నేర్పించాలని జిల్లా కలెక్టర్ వి విజయరామరాజు అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన హాల్ నందు ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ్ రామరాజు మాట్లాడుతూ ప్రకాశం పంతులు భారతదేశానికి చెందిన న్యాయవాది, వలసవాద వ్యతిరేక జాతీయవాది, రాజకీయ నాయకుడు, సంఘ సంస్కర్త అని అన్నారు. బ్రిటిష్ పాలనలో ఉన్న మద్రాస్ ప్రెసిడెంట్‌కి ముఖ్యమంత్రిగా కూడా ఉన్నారని, అలాగే ఆంధ్ర రాష్ట్రం మద్రాస్ నుంచి విడిపోయాక ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా ఉన్నారని చెప్పారు. టంగుటూరికు ఆంధ్ర కేసరి (ఆంధ్ర సింహం) అనే బిరుదు కూడా ఉందని చెప్పారు. టంగుటూరి ప్రకాశం పంతులు 23 ఆగస్టు 1872 వ సంవత్సరంలో మదరాసు ప్రెసిడెంట్ (ఇప్పటి ప్రకాశం జిల్లా) ఒంగోలు నగరంలోని వినోదయ రాయుని పాలెం అనే గ్రామంలో సుబ్బమ్మ మరియు గోపాలకృష్ణయ్య అనే దంపతులకు జన్మించారని అన్నారు. గోపాలకృష్ణయ్య మరణించటంతో ప్రకాశం తల్లి ఒంగోలులో వసతి గృహాన్ని నడిపేవారు అని ఆ రోజులలో ఈ వృత్తిని చేసేవారిని చిన్న చూపు చూసే వారని తెలిపారు. చిన్నతనం నుంచే ప్రకాశంకి లాయర్ అవ్వాలని కోరిక ఉండేదని కానీ చెడు సవాసాల వల్ల మెట్రిక్యులేషన్‌లో పాస్ అవ్వలేకపోయారని, టీచర్ హనుమంతరావు నాయుడు ప్రకాశాన్ని ఫీజు లేకుండా మెట్రిక్యులేషన్ లో చేర్పించారని అన్నారు. మంచి విద్య అందించడానికి టీచర్ హనుమంతరావు నాయుడు తనతో పాటు రాజమండ్రి కి తీసుకువెళ్లారని తర్వాత మద్రాసులో న్యాయ శాస్త్రం చదవటానికి వెళ్లడం జరిగిందని సెకండ్ గ్రేడ్ ప్లీడర్ అయ్యారని 1980 సంవత్సరంలో తన అక్క కూతురు హనుమాయమ్మను పెండ్లి చేసుకున్నారని చెప్పారు. కొన్ని రోజులు లాయర్ గా పనిచేసి రాజమండ్రి కి వెళ్లారని న్యాయవాద వృత్తిలో బాగా పేరు మరియు సంపదను సంపాదించారని, 1904వ సంవత్సరంలో రాజమండ్రి పురపాలక సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని చెప్పారు. ప్రకాశం విద్యకు కావలసిన ఖర్చులు జమీందారు కంచు మూర్తి రామచంద్రరావు భరించారని రామచంద్ర రావు మరియు ప్రకాశం యొక్క రాజకీయాలలో వేరువేరు పక్షాలలో ఉన్న రామచంద్రరావు ప్రకాశంను బాగా సహకరించాలని జరిగిందని చెప్పారు. ఒకసారి మద్రాస్ కేసు గురించి వెళ్లినప్పుడు ప్రకాశం ప్రతిభను చూసిన ఒక బారిస్టర్ సెకండ్ గ్రేడ్ ప్లీడర్ నుంచి బారిస్టర్ గా అవ్వమని సలహా ఇవ్వడం జరిగిందని, సెకండ్ గ్రేడ్ ప్లీడర్ హైకోర్టులలో వాదించలేరని, ఆ రోజులలో వేరే దేశాలకు వెళ్ళటం అనేది సాధారణ విషయం కాదని వెళ్తున్న సమయంలో తన తల్లి తో ఇంగ్లాండ్ వెళ్లిన తర్వాత మాంసం ధూమపానం మరియు మధ్యా నికి దూరంగా ఉంటానని అని చెప్పారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వి విజయరామరాజుతోపాటు మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అందరికి సంక్షేమ దిశగా వైసిపి ప్రభుత్వం

### గడప గడప కార్యక్రమంలో ఎమ్మెల్యే కొరముట్ల



చిట్వేలి, ఆగస్టు 23 ప్రభాతవార్త

అన్నివర్గాల వారికి రాష్ట్ర ప్రజలందరికి సంక్షేమ ఫలాలు అందించే దిశగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైసిపి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వవిప్, శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని తిమ్మయ్యగారిపల్లె, గ్రామ సచివాలయ పరిధిలోని చిల్లావాండ్లపల్లి, గిరిజనవాడలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా సమస్యలను, ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు త్వరితగతిన పరిష్కరించేదిశగా సంబంధిత అధికారులకు సూచించారు. వైసిపి ప్రభుత్వానికి అఖండ మెజారిటి ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులరెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు ఎల్‌వి మోహన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ మేక జయరాంరెడ్డి, ఎంపిపి చంద్ర, జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, రమణారెడ్డి, లింగం లక్ష్మీకర్, మోచర్ల నరసింహులు, ఎం.కనకరాజు, తహశిల్దారు శిరీషా, ఎంపిడిఒ శివరామిరెడ్డి, ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్, సచివాలయ అధికారులు, వాలంటీర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## పోరాటమే చేయని టిడిపి సంబరాలు హాస్యాస్పదం

### ఎమ్మెల్యే రాచమలు శివప్రసాద్ రెడ్డి



ప్రొద్దుటూరు, ఆగస్టు 23

ప్రభాతవార్త :

ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని 13వ వార్డులో ఇటీవల జరిగిన ఎన్నికలలో వైసీపీ మద్దతు తెలిపిన అభ్యర్థి పై వైసీపీ రెబల్ అభ్యర్థి 48 ఓట్లతో విజయం సాధిస్తే వార్డు ఎన్నికలలో పోటీ చేయకుండా అసలు పోరాటమే చేయని టిడిపి నాయకులు సంబరాలు చేసుకోవడం హాస్యా స్పదంగా ఉందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు బుధ వారం మీడియా సమావేశంలో ఉపఎన్నిక ఫలితాలపై ఎమ్మెల్యే రాచమల్లు అభి ప్రాయం ఏమిటని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ వార్డులో పోటీ చేయకుండా వైసీపీతో పోరాటమే చేయని టిడిపి వైసిపి రెబెల్ విజయం సాధిస్తే దసరా సంబరాలు చేసుకోవడంలో టిడిపి నాయకుల డొల్ల తనం బహిర్గతమైందని ఆయన చురకలటించారు. పోటీలలో పాల్గొని పోరా టం చేసి గెలిచిన వాడే గెలుపును ఆస్వాదించే అర్హత ఉంటుందని పోరాటమే చేయని టిడిపి నాయకులకు అర్హత లేదని అన్నారు. ఎన్నికలలో పోటీ చేసి వైసీపీతో పోరాటం చేసి విజయం సాధించి సంబరాలు జరుపుకోండి కానీ వైసీపీ మీద వైసిపి రెబల్ విజయం సాధిస్తే టిడిపి నాయకుల సంబరాలకు అర్థం లేదన్నారు. వైసీపీతో పోటీపడి గెలవాలంటే కష్టతరమన్న భావనతోనే టిడిపి నాయకులు సంబరాలలో మునిగితేలుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

## పాలకొండలో చిరుత పిల్లలతో సంచారం

### ఆందోళనలలో గొర్రెల కాపర్లు వాహనదారులు



రామాపురం, ఆగస్టు 23 ప్రభాతవార్త :

మండలంలోని గువ్వలచెరువు పరిధిలోని తూర్పు పాలకొండలో ఫారెస్ట్ గెస్ట్ హౌస్ సమీపంలోని లోయల్లో చిరుత పిల్లలుతో సంచారం చేస్తున్నట్లు గొర్రెల కాపర్లు వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కడప- రాయచోటి గువ్వలచెరువు ఘాట్ రోడ్డుపై ద్విచక్ర వాహనాల దారులు రావాలన్న ప్రజలు బాటసారిలు ఈ దారిలో నడవాలన్న భయాందోళనకు గురవుతున్నారు. పాలకొండలోనీ పపిరెడ్డి కుంట. విప్ల మడ పరిసర ప్రాంతాల్లో ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలలో చిరుతలు సంచారం చేస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు తెలియజేస్తున్నారు. కర్నూలు చిత్తూరు జాతీయ రహదారిలోని గువ్వల చెరువు ఘాట్ రోడ్లోలోని కోనేటి వద్ద కొలను వద్ద చిరుత తమ పిల్లలతో నివాసముండి సంచారం చేస్తున్నట్టు గొర్రెల కాపర్లు కు కనిపించినట్లు గ్రామాల ప్రజలకు దృష్టికి. వాహనదారులకు ఈ విషయం తెలియపరచినట్టు తెలిసింది. ఫారెస్ట్ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు గగ్గోలమంటున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని చిరుతలను పట్టుకొని వాటిని అదుపు చేయాల్సిన బాధ్యత ఫారెస్ట్ అధికారులకు ఎంతైనా ఉందని ప్రజలు తెలుపుతున్నారు. ఈ పాలకొండలు దట్టమైన అడవులు చెట్లు పెరగడంతో మరోపక్క కొండలు, పెద్దపెద్ద ప్లేట్లు బండలు లోయలు అధికంగా ఉండడంతో అవి వాటినీ నివాసంగా ఏర్పరచుకొని కొండ పరిసర ప్రాంతాల్లో సంచారం చేస్తున్నట్లు గొల్ల కాపర్లు తెలిపారు. ఈ విషయం పై బీట్ ఆఫీసర్ గాయత్రిని. వివరణ కోరగా తమ ఫారెస్ట్ పరిధిలోని పప్పిరెడ్డి కుంట విప్లమడ ప్రాంతాల పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని సీసీ కెమెరాలలో చిరుతలు తిరుగుతున్నట్లు ఫోటోలో కనిపించినట్టు అమే తెలిపారు. ప్రజలు పాలకొండల పరిధిలో వెల్లవద్దని అమే తెలిపారు.

## రూ.5కోట్లతో గ్రామాల లింకురోడ్లుకు భూమిపూజ

### మట్టిరోడ్లకు స్వస్థి పలకడంతో గ్రామస్థుల్లో ఆనందం



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న నాగరాజరెడ్డి

మదనపల్లె, ఆగస్టు 23 ప్రభాతవార్త :

స్వాతంత్ర్య రాకమునుపు నుంచి మట్టిరోడ్లలోనే వలసపల్లె గ్రామ ప్రజలు అష్టకష్టాలుపడేవారు. విద్యార్థులకు, రైతులకు, రోగులకు పట్టణాలకు ఇతర కారణాల వల్ల వెళ్ళాలంటే చాటా కష్టతరంగా మారేది. ఏ నాయకులు వచ్చినా మా కష్టాలు తీరలేదన్న నిరాశతో ఉన్న వలసపల్లె ప్రాంత గ్రామీణులకు రోడ్లుకు మహార్దశ కలిగింది. వలసపల్లె సర్పంచ్ సరస్వతమ్మ కుమారుడు జి.నాగరాజరెడ్డికి గ్రామస్థులు యదావిధిగా రోడ్డుసమస్యపై విన్నవించారు. నాగరాజరెడ్డి మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డిలకు ప్రజల సమస్యలపై విన్నవించగా వెంటనే స్పందించిన ఎంపి వలసపల్లె, కోటగడ్డ, కాట్లాటపల్లె, మొరాలను అనుసంధానం చేస్తూ తారురోడ్లుకు రూ.5కోట్లు నిధులు మంజూరు చేశారు. దీంతో గ్రామస్థుల్లో ఆనందం కలిగింది. ఈ రోడ్డు పనులను బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్ తనయుడు నాగరాజరెడ్డి,గ్రామస్థులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు సమక్షంలో భూమిపూజ చేశారు. మట్టిరోడ్లులో ప్రయాణం చేసిన మాకు తారురోడ్డు ఏర్పడడంతో వారి కళ్లల్లో ఆనందం కలిగింది. దీంతో మంత్రి, ఎంపి, సర్పంచ్, సర్పంచ్ తనయునికి వలసపల్లె గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపిటిసి మునిరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రుక్సానా హత్యకేసు సిబి సిఐడి విచారణ చేయాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు



మదనపల్లె, ఆగస్టు 23 ప్రభాతవార్త :

పట్టణంలో ప్రైవేటు లెక్చరర్ రుక్సానా హత్య కేసులో పోలీసులు తీరుపై అనుమానాలతో సిబి సిఐడికి అప్పగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఏదైనా కేసులో ఎఫ్ఐఆర్ నమోదైతే సవరణలు చేసుకోవచ్చునని, ఫిర్యాదునే మార్చడం చట్ట విరుద్ధమన్నారు. రుక్సానా హత్యకేసులో ఇలాంటి ఘటనే చోటు చేసుకొందని తెలిపారు. పోలీసులు రాజకీయ ప్రలోభాలకు తలొగ్గి మొదట 15మంది ముద్దాయిలుగా ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, తరువాత ఎఫ్ఐఆర్‌ను మార్చారన్నారు. దీనివల్ల దోషులు తప్పించుకొనే ప్రమాదం ఉందని భావించి సిబి సిఐడి విచారణ జరపాలని కోరామన్నారు. ఎఫ్ఐఆర్‌లో జరిగిన అవకతవకలపై డిజిపికి, కర్నూల్ డిఐజికి ఫిర్యాదు చేశామని రుక్సానా హత్యకేసును సిబిసిఐడికి అప్పగించాలని తెలిపారు.

## నాభూమి-నాదేశంలో మట్టి సేకరణ



మదనపల్లె, ఆగస్టు 23 ప్రభాతవార్త :

అజాద్‌క అమృత మహోత్సవంలో భాగంగా నాభూమి-నాదేశం నేలతల్లి, వీరులకు వందనం అనే కార్యక్రమాన్ని గ్రామజ్యోతి సొసైటి డైరెక్టర్ సుభద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె 25 పంచాయితీల నుంచి మట్టిని సేకరించారు. ఈ మట్టిని ఎంపిడిఓ భానుప్రసాద్‌చేతుల మీదుగా సుభద్రకు అందజేశారు. ఆమట్టిని జిల్లా కలెక్టర్ వద్దకు తీసుకెళ్ళి అనంతరం ఢిల్లీకి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ భానుప్రసాద్, ఎన్‌జిఓ సుభద్ర, ఈఓపిఆర్‌డి వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపిలో వాల్మీకుల ఎస్‌టి రిజర్వేషన్ తొలగింపు అన్యాయం


### ఉద్యమాలకు సిద్ధం కావాలంటూ పిలుపు



మదనపల్లెక్రైం, ఆగస్టు 23 ప్రభాతవార్త :

ఏపిలో గత 72ఏళ్ళుగా వాల్మీకులకు ఎస్‌టి రిజర్వేషన్ అమలు చేయకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యంచేస్తున్నాయని రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ వ్యవస్థాపకులు దిల్‌బాగ్‌టాంగ్ ప్రశ్నించారు. బుధవారం మదనపల్లెలోని ప్రెస్‌క్లబ్‌లో వాల్మీకి ధర్మ సమాజ్ కమిటీ బృందం మాట్లాడుతూ ఏపిలో వాల్మీకులపై వివక్ష చూపుతున్నారని ప్రభుత్వాలు స్పందించకపోతే ప్రజాక్షేత్రంలోనే తేల్చుకొంటామని వారు హెచ్చరించారు. ఎస్‌టి రిజర్వేషన్ పునరుద్దరణపై ఉద్యమం చేస్తామని తెలిపారు. ప్రభుత్వాలు మారినా వాల్మీకుల జీవనశైలి మారలేదని ఆవేదన చెందారు. దక్షిణాది రాష్ట్రాల పర్యటన అనంతరం ప్రణాళికలను సిద్ధం చేసుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. జాగో వాల్మీకి, చలో ఢిల్లీ అంటూ పిలుపునిచ్చారు. దీనిపై తమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రపతి, గరవ్నర్‌లకు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని, జిల్లా కలెక్టర్లకు ఇవ్వడం జరుతుందన్నారు. వాల్మీకులందరూ ఐకమత్యంగా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అశోక్‌మల్హోత్రా, ఆకాష్‌రాజు, స్థానిక నాయకులు గంపల గంగరాజు, వీరయ్య, వేణు, కావలి గంగులప్ప, పిల్లిల్ల రమేష్, మునిరామయ్య, నవీన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## తూతూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం



కేవి.పల్లె, ఆగస్టు 23 ప్రభాతవార్తః

మండలంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగానే జరిగింది. ఎంపీపీ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యల ప్రస్తావన రెండు,మూడు ప్రభుత్వ శాఖలకు సంబంధించి మాత్రమే ప్రజా ప్రతినిధులు సమస్యల గురించి ప్రస్తావించగా మిగతా సభ్యులు సమావేశానికి హాజరైనామా, వెళ్లామా అన్నట్లు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి ప్రజా ప్రతినిధులను తమ గ్రామ పరిధిలోని సమస్యలను అధికారులకు తెలియజేయండి వాటి పరిష్కారాలకు ప్రాధాన్యం ఉంటుంది అనగా ఒక్క గాలివారిపల్లె గ్రామ పంచాయతీకి సంబంధించి సర్పంచి రాంప్రసాద్ నాయుడు విద్యుత్ కోతలు ఎక్కువగా ఉన్నాయని తెలుపగా సాధ్యమైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని సంబంధిత శాఖ అధికారి తెలిపారు. వేసవి కాలం వలె ఎండలు మండుతున్న వేల నీటి ఎద్దడి వేల బోర్లలో నీరు రావడం నిలిచిపోయాయని వాటిని మరమ్మత్తు చేయాలని నీటి ట్యాంకరు ద్వారా ఝరికోన నీరు తెప్పించే కార్యక్రమం చేపట్టాలని అన్నారు. తహశీల్దారు నరసింహులు మాట్లాడుతూ మండలంలో 198 రేషన్‌కార్డులు కొత్తగా మంజూరైయ్యాయని జగనన్న సురక్ష కింద 1840 కుల దవీకరణ పత్రాలు 1962 ఆదాయ దవీకరణ పత్రాలను నాలుగు మరణ దవీకరణ పత్రాలు 37 ముటేషన్ దవపత్రాలు, 39 పొజిషన్ దవపత్రాలు ఇవ్వడం జరిగిందని గడప గడపకు బియ్యం పంపిణీకి ఆరు డ్రైవర్ వేకెన్సీలు ఉన్నాయని రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపీడీఓ ఆధ్వర్యంలో నియమించడం జరుగుతుందని అన్నారు. మండలంలో ఎక్కువగా భూ సమస్యలు పరిష్కారాలు కావలసి ఉందని ఆయన అన్నారు. హౌసింగ్ సంబంధించి 1300 గహాలు మంజూరు కాగా 1092 పూర్తయ్యే దశలో ఉన్నాయని 419గహాలు నిర్మాణ దశలో ఉన్నాయని 89 గహాలకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. వ్యవసాయాధికారిణి శ్రావణి మాట్లాడుతూ 13 ఆర్‌బీకేలలో ఉలవలు అందుబాటులో ఉన్నాయని 150 గంటలకు రైతు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అన్నారు. విద్యుత్, ఆర్‌డబ్ల్యూయస్, ఆర్‌జీయస్, వైద్యశాఖ, ఐసీడీఎస్ పంచాయతీ రాజ్ సోషియల్ వెల్ఫేర్ అటవీశాఖ వెలుగు హాజరు కాగా మరికొన్ని శాఖల వారు గైర్హాజరైయ్యారన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి, జడ్పీటీసీ గజ్జల శ్రుతి మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, సర్పంచిలు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాకు సహకరించండి

### ఆర్డీఓ ఎంఎస్.మురళి

మదనపల్లె, ఆగస్టు 23 ప్రభాతవార్త :

ఓటర్ల జాబితా తయారీకి ఇంటింటికి వచ్చే బూత్‌లెవల్ అధికారులకు (బిఎల్ఓ)లకు సహకరించాలని ఆర్డీఓ ఎంఎస్.మురళి తెలిపారు. ఓటర్ల జాబితాకు సంబంధించి బుధవారం సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ నాయకులు సహకరించాలన్నారు. ఓటర్ల మార్పు, చేర్పు, తప్పులపైన బిఎల్ఓలకు తెలియజేసి ఓటర్ల జాబితా నిక్కచ్చిగా ఉండేలా చూడాలన్నారు. వాలంటీర్లు ఎవరూ ఓటర్ల జాబితా వ్యవహారంలో జోక్యం చేసుకోరని వెల్లడించారు. ఇప్పటికే పట్టణంలో ఓటర్ల జాబితాకు సంబంధించి బిఎల్ఓలు నెల రోజులుగా కసరత్తు చేస్తున్నారన్నారు. జనవరి 5నాటికి 18ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఏదైనా సందేహాలు ఉంటే సూపర్‌వైజర్లు అడిగాలన్నారు. ప్రధానంగా రాజకీయ పార్టీ నాయకులు సహకరిస్తే బోగస్ ఓటర్లను పూర్తిగా తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రమీల, తహశీల్దార్ మహమ్మచాంద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డిసాహెబ్, సిపిఐ క్రిష్ణప్ప, సిపిఎం శ్రీనివాసులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఆంధ్రకేసరి మన టంగుటూరి ప్రకాశంపంతులు



వాల్మీకిపురం, ఆగస్టు 23ప్రభాతవార్తః

ఆంధ్రకేసరి మన టంగుటూరి ప్రకాశం పంతులు అని స్థానిక జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ అన్నారు. ప్రకాశం పంతులు జయంతిని పురస్కరిం చుకుని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో బుధవారం ఆయన చిత్రపటానికి అధ్యాపకులు విద్యార్థులతో కలిసి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ ఉమా అమరేశ్వరి మా ట్లాడుతూ 1872 ఆగస్టు 23న ప్రకాశం పంతులు ప్రకాశం జిల్లాలో జన్మించా రన్నారు. చిన్న తనం నుంచి కష్టపడి చదువుకుని న్యాయవాధి వత్తిని చేపటి ట మంచి పేరు గడించారన్నారు. అనంతరం అతనుచేసిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు భాస్కర్, ప్రసాద్, రమణ, కళావతి, జానీ బాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా శ్రీరాములు పట్టాభిషేకం



వాల్మీకిపురం, ఆగస్టు 23 ప్రభాతవార్తః

తితిదే ఆధ్వర్యంలోని స్థానిక పట్టాభిరాముడు ఆలయంలో వార్షిక పట్టాభిషక మహోత్సవాలలో భా గంగా మూడవ రోజు బుధ వారం వేద పండితులు మంత్రోచ్చారణల మద్య శ్రీరాముడి పట్టాభిషేకం కన్నుల పండుగగా నిర్వహించారు. అంతకుముం దు ఆలయంలో సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమై తదుపరి మూల విరాట్లకు అభిషేకం, అర్చన, తోమాల సేవ తదితర కార్యక్రమాలతో పాటు నిత్య సేవలు యధావిధిగా జరిగాయి. అనంతరం ఉదయం 9గంటలకు విశేషాలంకరణలో ముస్తాబైన సీతా రాముడిని ఊంజల మండపంలో అధిరోహింపచేసి వేద పండితులు శ్రీరాముడికి కిరీట దారుణ చేయడంతో శ్రీరాముడి పట్టాభిషేకం, ఘట్టం ముగిసింది. తదుపరి రాత్రి 7గంటలకు పట్టాభిశక్తుడైన శ్రీరాముడు బంగారు గరుడ వాహనాన్ని అధిరోహించి వాల్మీకి క్షేత్రంలోని తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. దీంతో శ్రీరాముడి పట్టాభిషేకం మహోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ ప్రదాన అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, కష్ణస్వామి భట్టార్, భాషికాచార్యులు, తితిదే అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## మండల అభివద్ధికి అధికారులు సహకరించాలి

### ఎంపీపీ వేంపల్లె నూర్జహాన్



కలికిరి, ఆగస్టు 23 ప్రభాతవార్తః

కలికిరిమండల అభివద్ధికి అధికారులు ప్రజా ప్రతినిధులు సహకరించాలని మండల ఎంపీపీ వేంపల్లె నూర్జహాన్ కోరారు. బుధవారం ఎంపీపీ అద్యక్షతన మండల పరిషత్ లో సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసమావేశంలో ఎంపీడీఓ గంగయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ రకాలుగా మంజూరు చేసిన అభివద్ధి పనులను డిసెంబరు నెలలోపు పూర్తిచేయించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎంపీడీఓ పేర్కొన్నారు. ఆతరువాత పనులు పూర్తిచేయిస్తే ఆపనులకు సంబంధించిన బిల్లులు బాద్యత సంబంధిత శాఖాధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎంపీడీఓ హెచ్చరించారు. కావున అభివద్ధి పనులను వేగవంతం చేయించాలన్నారు. వ్యవసాయాధికారిని మమతారెడ్డి మాట్లాడుతూ పంటలు వేసిన ప్రతి రైతు ఈక్రాప్ పంట నమోదుచేసుకోవాలన్నారు. మండలంలో 5475 మంది రైతులకు మూడు కోట్ల ఒక లక్ష రూపాయలు రైతు భరోసా కింద ప్రభుత్వం రైతుల ఖాతాలో జమచేయడం జరిగింది. పీఎఫ్‌కిసాన్ కింద 5472 మంది రైతులకు ఒక కోటి లక్ష రైతుల ఖాతాలో కేంద్ర ప్రభుత్వం జమచేసినట్లు వ్యవసాయాధికారిణి తెలిపారు. వేరుసెనగ పంట వేయని రైతులకు ప్రత్యామ్నాయ పంటగా ఉలవలు వేసుకునేందుకు 810 ఎకరాలలో ప్రభుత్వం 572 క్వింటాల్లు మండలానికి మంజూరు చేసినట్లు ఆమె వివరించారు. ట్రాన్సుకో ఏఈ ముజిబర్ రహమాన్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ కనెక్షన్లు కొరకు 44 మంది దరఖాస్తు చేసుకోగా 13మంది రైతులకు వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు. మిగిలిన కనెక్షన్లు సెప్టెంబరు ఆఖరు లోపు పూర్తిచేస్తామన్నారు. హౌసింగ్ ఏఈ వెంకటేష్ మాట్లాడుతూ మండలంలో 14 లేఅవుట్లలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. మదనపల్లె మార్గంలోని సీఎల్ఆర్‌సీ భవనం వెనుక వైపు ఉన్న జగనన్న కాలనీ ప్రారంభానికి సిద్ధం చేసినట్లు ఏఈ పేర్కొన్నారు. గుట్ట పాలెం సర్పంచి ఆర్.వెంకటరెడ్డి మాట్లాడుతూ తమ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంటు ఉద్యోగి తప్ప మిగిలిన వారు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని మండల సర్వసభ్య సమావేశంలో ఫిర్యాదు చేశారు. తమ గ్రామానికి మండల నిధులు ద్వారా రెండు వాటర్ ప్లాంట్లు సిమెంటు రోడ్లు మంజూరు చేయాలని కోరారు. గతంలో మండల సర్వసభ్య సమావేశం అంటే రసాభాసగా సాగేది. ఆసమావేశానికి కలికిరి సర్పంచి ఆర్.ప్రతాప్‌కుమార్‌రెడ్డి హాజరు కాకపోవడంతో మండల సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా జరిగిందని చర్చించుకుంటున్నారు. ఈకార్యక్రమంలో తహశీల్దారు భాగ్యలత, ఏపీఓ సుజాత, ఆర్‌డబ్ల్యూ, పీఆర్ ఏఈలు చక్రపాణి, అబిద్, వివిధ శాఖల అధికారులు సర్పంచిలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## చంద్రయాన్-3 విజయవంతంపై బిజెపి సంబరాలు

రాజంపేట అర్బన్, ఆగస్టు 23 ప్రభాతవార్త

చంద్రయాన్-3 విజయవంతం కావడంతో బిజెపి నేతలు రాజంపేటలో సంబరాలు నిర్వహించారు. అసెంబ్లి ఇన్‌ఛార్జి పోతుగుంట రమేష్‌నాయుడు జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో యువకులతో కలిసి జాతీయ జెండాను ఎగురవేసి మిఠాయిలు పంచారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఆకాశంలో కనిపించే చంద్రున్ని అందుకుంటామని ఎవరూ ఊహించి ఉండరని, అంతటి అసాధ్యాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు సుసాధ్యం చేశారని కొనియాడారు. చంద్రయాన్-3 విజయంతో ప్రపంచంలో భారత కీర్తి ప్రతిష్టలు పెంచిందని పేర్కొన్నారు. దేశానికి బలమైన నాయకత్వం, అద్భుతమైన ప్రోత్సాహం మంచి ఫలితాలను ఇస్తుందని, చంద్రయాన్ విజయంతో నిజమైందని పేర్కొన్నారు. అసెంబ్లి ఇన్‌ఛార్జి రమేష్‌నాయుడు మాట్లాడుతూ 140 కోట్ల భారతీయులు గర్వించేలా చంద్రయాన్-3 విజయవంతమైందన్నారు. ఈ సందర్భంగా యువకులు భారతమాతాకు జై అంటు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత పిఇటి షామీర్‌బాషా, పి.జయకోటేశ్వర్‌రావు, రామచంద్రారెడ్డి, సుదర్శన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రయాన్ విజయం పట్ల ముస్లీంల సంబరాలు



వాల్మీకిపురం, ఆగస్టు 23 ప్రభాతవార్తః

అత్యంత ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్-3 విజయవంతం కావడం పట్ల వాల్మీకిపురంలోనిముస్లీంలు సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా స్థానిక జామియా మసీదులో మగ్రిబ్‌నమాజ్ తరువాత ముస్లీంలు పరస్పరం మిఠాయిలు తినిపించుకొని జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ ఆనందోత్సవాలు జరుపుకున్నారు. చంద్రయాన్-3 విజయవంతం కావడంతో ప్రపంచంలోనే భారతదేశం అగ్రగామిగా నిలిచిందని ఇందుకోసం కషిచేసిన ఇస్రో శాస్త్రవేత్తలును అభినందించారు. భారతదేశంలో మునుముందు మరెన్ని విజయాలును సాధించి ప్రపంచంలోనే అగ్రదేశంగా నిలవాలని ప్రార్ధనలు చేశారు. ఈకార్యక్రమంలో ఇమామ్ ముఫ్తీ, రియాజ్ సాహెబ్, షకూర్‌సాహెబ్, రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, అమీర్‌హుస్సేన్ సాహెద్, మహబూబ్ అలీ, జలాలుద్దీన్ పాల్గొన్నారు.

## జయహో...భారత్

### పురవీధుల గుండా రెపరెపలాడిన జాతీయజెండా



రామసముద్రం, ఆగస్టు 23 పభాతవార్త :

జయహో...భారత్.. అంటూ రామసముద్రంలోని పురవీధుల గుండా మారుమ్రోగిస్తూ సంబరాలు జరుపుకొన్నారు. పురవీదుల్లో జాతీయ త్రివర్ణ పతాకాన్ని రివ్వున ఎగరేస్తు రెపరెపలాడిస్తూ యువత కేరింతలు కొట్టారు. ఇదంతా కేవలం చంద్రయాన్-3 విజయవంతం కావడంతో విద్యార్థులు, యువతల్లో ఆనందంకు అవదులు లేకుండా కేరింతకలు కొట్టారు. చంద్రయాన్-3 ప్రత్యక్ష ప్రసారం చేయడం సాఫ్ట్ ల్యాండింగ్‌ను డిజిటల్ టీవీల్లో వీక్షించడం జరిగింది. చంద్రయాన్ సక్సెస్ కావడంతో ఇస్రో శాస్త్రవేత్తలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. దీంతో పురవీధుల్లో విద్యార్థులు భారత్‌మాతాకి జై అంటూ చక్కర్లు కొట్టారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు నారాయణ స్వామి, పీడిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రుక్సానా హత్యకేసులో 12మంది నిందితులు గుర్తింపు

### పదిమంది అరెస్టు రిమాండ్‌కు తరలింపు : డిఎస్‌పి కేశప్ప



మదనపల్లెక్రైం, ఆగస్టు 23 ప్రభాతవార్త :

పట్టణంలో ఇటీల జరిగిన మహిళా లెక్చరర్ రుక్సానా హత్య కేసులో పది మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌పి కేశప్ప తెలిపారు. బుధవారం డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుక్సానా హత్య కేసును చాలెంజ్‌గా తీసుకొని ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ హత్యలో 12మందిని నిందితులను నిర్ధారణ చేసి కేసులు నమోదు చేశామన్నారు. వీరిలో 10మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని వీరికోసం ప్రత్యేక టీమ్‌లచే గాలిస్తున్నట్లు వివరించారు. కేసు నమోదు, అరెస్టులపై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మరాదని బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాల్ డేటా ఆధారంగా నిందితులను గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. ఇందులో ఎవరినీ ఉపేక్షించబోమని అందరిని అరెస్టు చేసి జైలుకు పంపుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వినియోగదారుల ప్రయోజన సంరక్షణే ట్రాయ్ లక్ష్యం

గాలివీడు, ఆగస్టు 23 ప్రభాతవార్త :




వినియోగదారుల ప్రయోజనాల సంరక్షనే ట్రాయ్ లక్ష్యమని టెలి కమ్యూనికేషన్ వినియోగదారుల అవగాహన సదస్సులో బిఎస్ఎన్ ఎల్ అధికారులు జేటిఓ ఎస్.శివప్రసాద్,జేఈఓ బి.వీ సుబ్బారాయుడు తెలిపారు. బుధవారం మండలంలోని సీసీ పల్లెలో ట్రాయ్ న్యూ ఢిల్లీ వారి సౌజన్యంతో సిఏజి సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ట్రాయ్ కమ్యూనికేషన్ రంగంలో వినియోగదారుల ప్రయోజనాలను సంరక్షించడం కోసం టెలికాం నియంత్రణ సంస్థ ప్రధాన భాద్యతలో ఒకటని సి.ఏ.జి సభ్యులు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మానవుని దైనందిన జీవితంలో దూరవాణి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందన్నారు.ట్రాయ్ గణాంకాల ప్రకారం 117.1 కోట్ల వినియోగదారులు ఈసేవలను వినియోగించుకుంటున్నారన్నారు. ట్రాయ్ వినియోగదారులకు ఉచితంగా అందిస్తున్న మై కాల్ యాప్, మై స్పీడ్ యాప్, డునాట్ డిస్టర్బ్ యాప్ ఉపయోగించి మరింత సేవలను అందిపుచ్చుకో వాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పి.కిషోర్ రెడ్డి,నాగబాసిరెడ్డి, సుబ్బారెడ్డి, చెన్నారెడ్డి, వినియోగదారులు,అంగన్వాడీ కార్యకర్తలు,రేషన్ షాపు డీలర్లు, పాల్గొన్నారు.

## చిన్నపిల్లలను కూలీలుగా ఉపయోగించడం చట్టరీత్యా నేరం



పులివెందుల రూరల్, ఆగస్టు 23, ప్రభాతవార్త :

చిన్నపిల్లలను కూలీలుగా ఉపయోగించడం చట్టరీత్యా నేరమని ఎస్సై హుసేన్ తెలిపారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికశాఖ, పోలీసు, రెవెన్యూ, రైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేక తనిఖీలలో భాగంగా బుధవారం ఇటుకల పరిశ్రమ, కంకర మిషన్, తదితర ప్రాంతాలలో వెట్టిచాకిరి, బాలకార్మికుల వినియోగంపై అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించారు. అక్కడ పనిచేస్తున్న కార్మికుల వివరాలను అడిగి తెలుసుకుని వారికి అందుతున్న వేతనాలపై సమగ్రంగా విచారణ జరిపి భద్రతపై ఆరా తీశారు. కార్యక్రమంలో రైడ్స్ సంస్థ డైరెక్టరు త్యాగరాజు, లేబర్ అధికారి అల్లాబకాష్, డిప్యూటి తహసీల్దారు కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



వేంపల్లె, ఆగస్టు 23, ప్రభాతవార్త :

ఇటీవల మృతిచెందిన డ్రైవరు రామక్రిష్ణ కుటుంబానికి వైఎస్ఆర్ సుమో స్టాండ్ ఆధ్వర్యంలో ఆర్థికసహాయం అందించారు. బుధవారం స్థానిక పుల్లయ్యతోటలో నివాసం ఉంటున్న మృతుడి కుటుంబ సభ్యులను సుమోస్టాండు సభ్యులు పరామర్శించారు. రూ.30వేలు నగదును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవరుగా తన జీవనం సాగిస్తున్న రామక్రిష్ణ అనారోగ్య కారణంతో మృతిచెందడం చాలా బాధాకరం అన్నారు. రామక్రిష్ణ కుటుంబీకులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సుమో స్టాండు అధ్యక్షుడు నాగేంద్రబాబు, ఉపాధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డి, డి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.అంజి, ప్రధాన కార్యదర్శి విజయ్, ఎస్వీఎస్ రమణ, సూరి, రాజా, మాధవ, ఆది, రంగారెడ్డి, రామయ్య, సుధాకర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ బస్సుయాత్రను విజయవంతం చేయండి



వేంపల్లె, ఆగస్టు 23, ప్రభాతవార్త :

వేంపల్లెలోని ఎస్టీయూ కార్యాలయంలో బుధవారం సీపీఐ బస్సు యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు మాట్లాడుతూ రాష్ట్రాన్ని రక్షించండి.. దేశాన్ని కాపాడండి పేరుతో జరుగుతున్న సీపీఐ 26జిల్లాల బస్సుయాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసంక్షేమ పాలన విస్మరించి ప్రజా వ్యతిరేక విధానాలను అమలు పరుస్తూ కేంద్రంలో, రాష్ట్రంలో శాంతిభద్రతలు గాలికి వదిలేసి అధికారమే పరమావధిగా ప్రభుత్వాలను నడుపుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక తిరోగమన విధానాలను ఎండగట్టడానికి, తద్వారా ప్రజలను చైతన్యం చేసేందుకు ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈనెల 30న జిల్లాలోని బద్వేలు నియోజకవర్గంలో ప్రారంభమై కడప, కమలాపురం, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నియోజకవర్గాల మీదుగా బస్సుయాత్ర సాగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ పులివెందుల ఏరియా సహాయ కార్యదర్శి బాష, తొండూరు మండల కార్యదర్శి మురళి, వేంపల్లె నాయకులు మల్లేష, అంజనప్ప, వేముల మండల కార్యదర్శి బాష, సీపీఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

రాజంపేట అర్బన్, ఆగస్టు 23 ప్రభాతవార్త

కడప - రేణిగుంట జాతీయ రహదారిలోని చెయ్యేరు వంతెనపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగసరాల జయదేవ్(26) అనే యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్కూటర్‌పై వంతెనపై వస్తుండగా కారు ఢీకొనడంతో జయదేవ్ మృతదేహం ఛిద్రమైంది. నడిరోడ్డుపై ప్రమాదం జరగడంతో జాతీయ రహదారికి ఇరువైపులా కిలోమీటరు దూరం వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

## చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



రైల్వేకోడూరు, ఆగస్టు 23 ప్రభాతవార్త

రైల్వేకోడూరు పట్టణంలోని హెచ్ఎంఎం హైస్కూల్లో పూర్వ విద్యార్థులు నేతాజి, బాలాజి, విజయమ్మలు ఇక్కడ చదువుకున్న విషయం విధితమే. ఈనేపథ్యంలో తాము చదువుకున్న విద్యాలయానికి వంట చేసే మనుషులకు కుర్చీలు లేక, పాఠశాలలో విద్య చెప్పే విద్యార్థులకు కుర్చీలు లేకపోవడంతో వారందరికి పూర్వ విద్యార్థులు నేతాజి, బాలాజి, విజయమ్మలు కుర్చీలను వితరణ చేసినట్లు పాఠశాల అధ్యాపకులు వెంకటరమణ తెలిపారు. ముఖ్యంగా చదువుకున్న పాఠశాలకు ఏదోక రూపంలో పాఠశాల రుణం తీర్చుకోవడం గొప్ప విషయమని హెచ్ఎంఎం హైస్కూల్ అధ్యాపక బృందం పేర్కొన్నారు.

## శ్రీరమాదేవి మల్టీసూపర్ స్పెషాల్టీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

పెద్దమండ్యం ఆగస్టు 23 ప్రభాతవార్త

మండలంలోని పెద్దమండ్యం సంతగేటునందు శుక్రవారం 25వతేదీన ఉదయం 9గంటలనుండి మద్యాహ్నం 3గంటలవరకూ రమాదేవిమల్టీసూపర్ స్పెషాల్టీ ఆసుపత్రి తిరుపతిఆధ్వర్యంలో ఉచితవైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. అన్నిరకాల జబ్బులకు,ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లుతెలిపారు. నెప్రాలజి,యూరాలజీ,న్యూరాలజీ,ప్లాస్టిక్‌సర్జరీ, ఎముకలు,కీళ్ళు,ఈఎన్‌టి, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ,తదితరరోగాలకు చికిత్సలు ఉచితంగా నిర్వహించిఆపరేషన్‌లు,మందులు ఉచితంగా ఇవ్వబడుతుందన్నారు. కావునమండల ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని ఒకప్రకటనలో తెలిపారు. ఇందులో వైఎస్సార్,ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ హెల్త్‌స్కీం,ఆరోగ్యరక్ష,జర్నలిస్ట్ హెల్త్ స్కీంలద్వారా ఉచితంగా ఆపరేషన్లు,దయాలసిస్ చేయబడును అనితెలిపారు.

# ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి

## రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ కలీమ్



పీలేరు,ఆగస్టు 23 ప్రభాతవార్తః

కంప్యూటర్ ఉచిత శిక్షణ కార్యక్రమ లక్ష్యాలను సాధించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. బుధవారం స్థానిక ఉర్దూ అకాడమి కంప్యూటర్ శిక్షణ కేంద్రం గ్రంధాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఉర్దూ భాషాభివద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్నారని ఇందులో భాగంగా నే రాష్ట్ర ఉర్దూ అకాడమితో స్కిల్ డెవలప్‌మెంటు కార్పోరేషన్ ఎంఓయు కుదుర్చుకుందన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమి నైపుణ్యాభివద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యార్థులు యువత ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా ఉర్దూ అకాడమి సిబ్బంది శ్రద్దతీసుకోవాలన్నారు. ప్రతి బ్యాచ్‌కు 30 మంది తగ్గకుండా శిక్షణకార్యక్రమాన్ని నిర్వహంచాలన్నారు. కంప్యూటర్ శిక్షణ పట్ల అలసత్వం వహించరాదని, సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈకార్య క్రమంలో స్థానిక సెంటర్ అభివద్ధి కమిటీ ఛైర్మన్ ఖాన్ ఖలీల్ సాహెబ్, సీటీసీ ఇన్‌చార్జి నాజియా, గ్రంథాలయ అధికారి జావిద్‌హుస్సేన్, సిబ ంది షాజహాన్, ఉమర్ పాల్గొన్నారు.

# హత్యకేసులో నిందితుడి అరెస్టు



పులివెందుల, ఆగస్టు 23, ప్రభాతవార్త :

లింగాల మండలంలోని పార్నపల్లె గ్రామంలో ఉన్న కోన మల్లేశ్వరస్వామి ఆలయంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న చిల్లా ఈశ్వరయ్య(65)ను హత్య చేయడం జరిగిందని పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈశ్వరయ్య హత్యకేసుకు సంబంధించి పార్నపల్లె గ్రామం ఎవరో ఆలయ పాత వంటగదిలో రోకలిబండతో తలపై కొట్టి హత్యచేశారని ఈశ్వరయ్య మృతదేహాన్ని పొయ్యిగాడిలో పడివేశారని, ఆలయంలో సీసీటీవీ రూమ్స్ లో ఉన్న మానిటర్‌ను కూడా తీసుకువెళ్లారని, ఆలయం ఎదురుగా ఉన్న అన్నదాన సత్రంలో వంట మనిషిగా పనిచేసే రామాంజనేయులు అతను ఉదయం నుండి కనపడలేదని, అతనే వాచ్‌మెన్ ఈశ్వరయ్యను హత్యచేసి ఉంటాడని ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్‌శాస్త్రి లింగాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విఆరణ చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. బుధవారం రూరల్ ఇన్‌ఛార్జి సీఐ రాజుకు అందిన సమాచారం మేరకు గూడూరు రామాంజనేయులు కదిరిరోడ్డులో ఉండగా అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు.

# మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం



పులివెందుల రూరల్, ఆగస్టు 23, ప్రభాతవార్త :

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావల్సిన మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అన్నారు. పులివెందులలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ వి.వరప్రసాద్, మున్సిపల్ కమిషనరు నరసింహారెడ్డితో కలిసి పురపాలక సంఘం పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనుల గురించి అధికారులతో కలిసి చర్చించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరుస్తూ అందులో చదువుతున్న విద్యార్థులకు కావల్సిన అన్ని మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అన్నారు. పిల్లలకు ప్రతిరోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోనం అందించాలన్నారు. అంతేకాకుండా పదో తరగతిలో విద్యార్థులు అధికశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వీరారెడ్డి, ఉపాధ్యాయులు, పనులను పర్యవేక్షిస్తున్న అమెనిటీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

# సంగన కిషోర్ రెడ్డి మాట్లాడడంలో వాస్తవం లేదు

## ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి

మైదుకూరు, ఆగస్టు 23 ప్రభాతవార్త :



ఎమ్మెల్యే అండదండలతో భూకబ్జాలకు పాల్పడుతున్నారని మంగళవారం సింగన కిషోర్ రెడ్డి ఎమ్మెల్యేను ఉద్దేశించి మాట్లాడడంలో ఎలాంటి వాస్తవం లేదని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మైదుకూరు ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీ.వి సత్రం సమీపాన జరిగిన గొడవకు, భూ కబ్జాలకు ఎలాంటి సంబంధం లేని ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డికి చెడ్డ పేరు వచ్చే విధంగా సింగన కిషోర్ రెడ్డి మాట్లాడడం సరైన పద్ధతి కాదని, మాట్లాడే ముందు ఆలోచించుకొని మాట్లాడాలని కిషోర్ రెడ్డిని హెచ్చరించారు. కిషోర్ రెడ్డి మాట్లాడిన మాటలు వెనక టిడిపి వారి హస్తము ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. వైఎస్ఆర్సిపి అభిమానినని జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో సహకరించానని కిషోర్ రెడ్డి చెప్పడం ఆలోచించాల్సిన విషయమేనన్నారు. నిజంగా కిషోర్ రెడ్డికి వైయస్సార్ పార్టీ పైన ఎమ్మెల్యే పైన అభిమానం ఉంటే ఎవరో కబ్జా చేయడానికి ప్రయత్నించిన భూమి పైన ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించమని అడగాల్సింది పోయి ఎమ్మెల్యే పైన బురద జల్లడం మానుకోవాలని అన్నారు.అలాగే కొంతమంది పెడకంటి రెడ్ల గురించి మాట్లాడిన మాటలకూ పెడకంటి రెడ్లల్లో బొర్రా సాంబశివారెడ్డి, శ్రీయపురెడ్డి బాల నరసింహారెడ్డి, అన్నవరం రామ్మోహన్ రెడ్డి, మూల సుధాకర్ రెడ్డి లకు పదవులలో ఎమ్మెల్యే అన్యాయం చేశాడని అనడం సరైన పద్ధతి కాదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వచ్చినప్పటి నుంచి మమ్మల్ని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కన్న బిడ్డలాగా చూసుకుంటున్నారని పోకనాటి రెడ్లకు సమానంగా మిగతా గుంపుల వారికి కూడా సమాణమైన ప్రాధాన్యతనిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బొర్రా రాఘవరెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్రీయపురెడ్డి బాల నరసింహారెడ్డి, సింగల్ విండో ప్రెసిడెంట్ మూల సుధాకర్ రెడ్డి, అన్నవరం రామ్మోహన్ రెడ్డి, ఏపీడబ్ల్యూఐసి డైరెక్టర్ గంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రయాన్-3 విజయవంతం పట్ల హర్షం

## జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్‌పురుషోత్తం



రాయచోటి,ఆగస్టు 23 ప్రభాతవార్తః

అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం లో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం చంద్రయాన్ 3 విజయవంతం అయిన సందర్భంగా బుధవారం ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియ చేస్తూ కేక్ కట్ చేసి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం మాట్లాడుతూ ప్రపంచ దేశాలు గర్వించే విధంగా భారత శాస్త్రవేత్తలు పని చేసి భారతదేశ కీర్తి ప్రతిష్టలను పెంచారన్నారు ఈ కార్యక్రమంలో ఏడి ప్రసాద్ బాబు పి ఆర్ టి యు రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ శ్రీనివాసరాజు అన్నమయ్య జిల్లా డిసిఇబి సెక్రెటరీ నాగ మునిరెడ్డి ఐ ఈ ఆర్ టి కోఆర్డినేటర్ జనార్ధన్ జిల్లా వ్యాయామ సంఘ ఉపాధ్యాయుడు నరసరాజు కార్యాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శమూర్తి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు

## కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ



రాయచోటి,ఆగస్టు 23 ప్రభాతవార్తః

స్వాతంత్ర సమరయోధులు, ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శమూర్తి అని కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ అన్నారు. బుధవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ లో 'ఆంధ్ర కేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సందప్ప, జిల్లా పర్యటక శాఖ అధికారి నాగభూషణం తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ మాట్లాడుతూ.... నైతిక విలువలను ప్రాణంగా భావించే ఆయన జీవితం ఎందరికో ఆదర్శమని అన్నారు. నమ్మిన దాన్ని ఆచరించడంలో, నైతికంగా వ్యవహరించడంలో ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. ఆయన బాటలో అంతా నడవాలని పిలుపునిచ్చారు. జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సందప్ప మాట్లాడుతూ....నిబద్ధత, ధైర్యం, సమైక్యతకు నిదర్శనం.. స్వాతంత్ర్య సమర యోధుడు, 'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు అన్నారు. అలాంటి మహనీయుల అడుగుజాడలో నడుచుకోవడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

# చంద్రయాన్-3 విజయం పట్ల సంబరాలు



బద్వేల్ అర్బన్, ఆగస్టు 23, ప్రభాతవార్త :

చంద్ర యాను - 3 సక్సెస్ కి సంతోషంగా పోరుమామిళ్ల రోడ్డు గాంధీ బొమ్మ సర్కిల్ పెద్ది మెన్స్ వేర్ దుకాణం వద్ద భారీగా యువకులు భానసంచ కాల్చుతూ, ప్రత్యేక కేక్ కట్ చేసి పలువురికి కేక్ తినిపిస్తూ సంబరాలు చేసుకున్నరు, మున్సిపాలిటీ పరిధి పలు ప్రధాన రహదారులో పలువురు యువకులు జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు, ఈ సందర్భంగా పెద్ది సుధాకర్ బాసికాల శ్రీనివాసులు, పండుగాయల శ్రీనివాసులు, పి, నరసింహులు, జి, నరసింహులు ఎల్ఐసి సుబ్బారావు, షేక్ దాదా పీర్, అన్వర్ భాష, వెంకటేష్, శివప్రసాద్ రాజు, పెద్ది సునీల్, చంద్ర,పుల్లయ్య, నారాయణ,సుమన్ తోపాటు పలువురు మాట్లాడుతూ చంద్రయాన్ 3 సక్సెస్ ఎంతో చారిత్రకమైన విషయం అన్నారు చరిత్ర సృష్టించింది ఇప్పటివరకు ఏ దేశంలో దిగని రక్షణ దిగని ఘర్షణ ధ్రువంపై విక్రం ల్యాండర్ కాళ్ళు మో పి మీసం మెల్లేశారన్నారు, ఈ రోజు సాయంత్రం ఐదు గంటల 44 నిమిషాలకు ల్యాండింగ్ ప్రక్రియ మొదలవగా 6.04 నిమి, చందమామను చంద్రయాన్ ముద్దాడి అంతరిక్షంలో భారత ప్రతిష్టలు చెప్పారు అన్నారు ఇక నేటి నుంచి 14 రోజులు పాట జాబిల్లిపై రోవర్ పరిశోధనలు జరుపనున్నారు, జయహో భారత్ అంటూ క్షేమంగా దిగిన విక్రమ్ ల్యాండర్, శాస్త్రవేత్తలకు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కి అభినందనలు తెలియజేశారు, నెల్లూరు రోడ్డు గురు కాఫీ కేఫ్ ఓనర్ సుబ్బరాయుడు యాదవ్ భారీగా బాణాసంచి కాల్చుతూ శాస్త్రవేత్తలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# విద్యార్థులకు మార్తాన్‌రన్ కాంపిటీషన్స్



వేంపల్లె, ఆగస్టు 23, ప్రభాతవార్త :

వేంపల్లెలోని వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు బుధవారం మార్తాన్‌రన్ కాంపిటీషన్స్ నిర్వహించారు. బుధవారం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, రెడ్‌రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటరు డాక్టర్ సుధాకర్‌లు జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు కూడా ఈ కాంపిటీషన్స్ నందు చురుగ్గా పాల్గొన్నారు. అనంతరం రెడ్ రిబ్బన్‌క్లబ్ కోఆర్డినేటరు మాట్లాడుతూ ఈ కాంపిటీషన్స్‌లో ఎంపికైన విద్యార్థులను జిల్లాస్థాయి కాంపిటీషన్స్‌లో పాల్గొంటారని ఎంపికల ప్రక్రియ కళాశాల పీడీ తేజేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సతీష్, డాక్టర్ రామక్రిష్ణ, డాక్టర్ మల్లేశ్వరమ్మ, రాజారెడ్డి పాల్గొన్నారు.

# పట్టుబడిన ఎర్రచందనం దుంగలు, నిందితులు

రైల్వేకోడూరు, ఆగస్టు 23 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలంలోని కెవి బావి పరిధిలోని పరిసర ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహిస్తున్న సందర్భంలో పిల్లలకోన ప్రాంతంలో 7 ఎర్రచందనం దుంగలను కనుగొని అక్కడే ఉన్న 5 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు ఫారెస్ట అధికారి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఇటీవల కాలంలో ఎర్రచందనం నిందితులపై ప్రత్యేక నిఘా ఉంచి వారిని గమనించి ఎట్టకేలకు నిందితులను అరెస్ట్ చేసినట్లు వారు తెలిపారు.

# మానవతా విలువలపై చైతన్య సదస్సు

## - విద్యార్థులు నైతిక విలువలు కలిగి ఉండాలి



కాశినాయన, ఆగస్టు 23ప్రభాతవార్త:

మండలంలోని నర్సాపురం మోడల్ స్కూల్, వరికుంట్ల కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో రెండు రోజుల పాటు వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో మానవతా విలువలపై చైతన్య సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ గౌరవ సలహాదారులు రాజోలి శ్రీధర్‌రెడ్డి, మదర్‌థెరిస్సా ఫౌండేషన్ చైర్మెన్ రవి ప్రకాష్‌రెడ్డిలు మాట్లాడుతూ తల్లిదండ్రులుతలదించుకొనకుండా ఉండాలన్నా, గురువులు గర్వపడాలన్న విద్యార్థులు విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలన్నారు. ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. లక్ష్యం పట్ల స్పష్టత ఉండి దానిని సాధించుకొననడానికి కష్టపడాలన్నారు. తల్లిద ండ్రుల కష్టాన్ని గుర్తించుకొని ప్రవర్తించాలన్నారు. ఆలోచనలు ఉన్నతంగా పెట్టుకుని ఆచరణలో నిబద్దత కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సౌజన్య, ఎస్‌వో మేర్సీ, సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి, సంస్థ ప్రతినిధులు ముత్తుముల రామతులసి, చిన్నప్పరెడ్డి, ప్రసన్న కుందారపు ప్రసన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రమాదాలు జరిగే ప్రాంతంలో వేగనిరోధకాలు

## ట్రాఫిక్ ఎస్ఐ ఎస్ఎండి రఫీ



రాయచోటి, ఆగస్టు 23 ప్రభాతవార్త

రాయచోటి పట్టణం ప్రధాన రహదారుల్లో ప్రమాదాల నివారణకు వాహనాల వేగం తగ్గించడానికి రేడియం టైర్లు రహదారులపై ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ ఎస్ఎండి రఫీ తెలిపారు బుధవారం రాయచోటి పట్టణం మదనపల్లి రోడ్డు మార్గాన రేడియం టైర్లు ఏర్పాటు చేశారు దీంతో వేగంగా వచ్చే వాహనాలు వేగం తగ్గి వెళ్లాల్సి వస్తుందన్నారు అన్ని రోడ్లలో వాహనాల వేగం తగ్గించడానికి రేడియం టైర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు పట్టణంలో ట్రాఫిక్ నివారణకు మైనర్లు వాహనాల డ్రైవింగ్ పట్ల కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ ఏం డి రఫీ తెలిపారు.

# అంతరిక్ష చరిత్రలో చరిత్ర సృష్టించిన భారత్

## చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతంపై విద్యార్థులు సంబరాలు



గాలివీడు, ఆగస్టు 23, ప్రభాతవార్త :

అంతరిక్ష చరిత్రలో భారత్ చరిత్ర సృష్టించిందని గౌతమ్ పాఠశాల ప్రిన్సిపాల్ సైజు థామస్ పేర్కొన్నారు.బుధవారం చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతమైన ప్రత్యక్ష కార్యక్రమాన్ని పాఠశాల ఆవరణంలో ఎల్ఈడీ తెరపైన విద్యార్థులతో కలసి పాఠశాల ఉపాధ్యాయ బృందం వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. అనంతరం చంద్రయాన్ 3 విజయవంతం కావడంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు సంబరాలు చేసుకున్నారు.ఇస్రో శాస్త్రవేత్తలుకు అభినందనలు,శుభాకాంక్షలు తెలిపారు.చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని చేరుకున్న మొదటి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందన్నారు.ఈ ప్రయోగం విజయవంతం ద్వారా ప్రపంచంలో మన దేశ ఖ్యాతిని పెంచిన ఇస్రోశాస్త్రవేత్తలుకు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులకు అభినందనలు తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రికి ఎల్ఇడి టివి వితరణ



నందలూరు, ఆగస్టు 23 ప్రభాతవార్త

అన్నమయ్య యువశక్తి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షులు పునగాని గుణయాదవ్ తండ్రి పునగాని సుబ్బనరసింహులు జ్ఞాపకార్థం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి 20 వేల రూపాయలు విలువ గల 42 ఇంచెల టివిని మండల ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గుణ మాట్లాడుతూ నందలూరు మండలంలోని స్థానిక పిహెచ్‌సిలో ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందించే వైద్య సేవల పట్ల అవగాహన కల్పించడానికి ఆసుపత్రికి ఎల్ఇటి టివిని ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు కార్యక్రమంలో మండల వైద్యాధికారులు సృజన, చంద్రశేఖర్‌రెడ్డి, మండల కోఆప్షన్‌మెంబర్ కలీంఖాన్, హిమగిరియాదవ్, ఆనంది వేణుగోపాల్, పెనుబల నాగసుబ్బయ్య, మండలంలోని నాయకులు పాల్గొన్నారు.

# నింగిని జయించిన రోజు

వీరబల్లి, ఆగస్టు 23 ప్రభాతవార్త



చంద్రయాన్-3 విజయవంతంతో వీరబల్లి మండల కేంద్రంలో విఆర్డీఎస్ ఆధ్వర్యంలో యువకులు బాణా సంచా పేల్చి, జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకుడు శ్రీధర్ రెడ్డి, విఆర్డీఎస్ సురేంద్రరెడ్డిలు మాట్లాడుతూ నింగిని జయించిన రోజు అని జాబిల్లిపై ఇప్పటి వరకు ఏ దేశం దిగని దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్ కాలు మోపి మీసం మెలేసిందన్నారు.సాయంత్రం 6 గంటల 4 నిమిషాలకు చందమామను చంద్రయాన్-3ముద్దాడి అంతరిక్షంలో భారత ప్రతిష్టను చాటి చెప్పిందన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలకు ధన్యవాదాలు తెలిపి ఒకరి కొకరు స్వీట్లు తినిపించుకున్నారు.ఈ కార్యక్రమంలో వివేకానంద స్కూల్ కరెస్పాండంట్ మధు సూధన్ రెడ్డి, రవి, అబ్బాస్ పలువురు యువకులు పాల్గొన్నారు.

# మహిళకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలి

## స్విమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ



రాజంపేట అర్బన్, ఆగస్టు 23 ప్రభాతవార్త

పురుషులతో పాటు మహిళలకు అన్నిరంగాల్లో సమాన అవకాశాలు కల్పించినప్పుడే రాణిస్తారని, సమానత్వం సాధ్యమవుతుందని స్విమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ పేర్కొన్నారు. స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు పురుషులతో పోల్చితే అన్ని రంగాల్లో చాలా వెనుకబడి ఉన్నారని పేర్కొన్నారు. పురుషులతో పాటు సమానంగా ఎదిగేందుకు ప్రతి మహిళా విద్యార్థిదశ నుంచే లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలన్నారు. ముఖ్యంగా విద్య, వైద్య, శాస్త్రవేత్తలు పరిశ్రమల స్థాపనలో మహిళలు దృష్టి సారించి లక్ష్యాలను సాధించాలన్నారు. దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా చూడాలన్న ఉద్దేశ్యంతోనే ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ, కళాశాల డీన్ సుబ్బారావు, హెచ్ఓడి పద్మలలిత తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పరపల్లె దళితవాడకు మహర్దశ



రైల్వేకోడూరు, ఆగస్టు 23 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలంలోని ఎస్.ఉప్పరపల్లె దిగువ హరిజనవాడకు కమ్యూనిటి హాలును ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, పంజం సుకుమార్‌రెడ్డి, ధ్వజారెడ్డి, తోట శివసాయిలతో పాటు సర్పంచ్ ఆనాల కవితాచెంగల్‌రెడ్డిలు భూమిపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ దళితవాడలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక నిధులను కేటాయించి అనగారిన వర్గాలకు మహర్దశ చేకూర్చేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. అదేకోవలో ఉప్పరపల్లెలో కమ్యూనిటి హాలును అత్యంత వేగవంతంగా నిర్మించి ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ రాజు, జడ్‌పిటిసి పలెంకోట రత్నమ్మ, సర్పంచుల సంఘం అధ్యక్షులు నాయిని హరిక్రిష్ణారెడ్డి, మల్లు క్రిష్ణారెడ్డి, దొమ్మరాజు సుబ్రమణ్యంరాజు, గోపి, దార్ల చంద్రశేఖర్, శెట్టిగుంట షఫి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రయాన్-3 విజయంపై సంబేపల్లి హైస్కూల్ విద్యార్థుల సంబరాలు



సంబేపల్లి, ఆగస్టు 23 ప్రభాతవార్త

చంద్రుని దక్షిణ ధ్రువం పై అడుగుపెట్టిన చంద్రయాన్ 3 విజయంపై మండల కేంద్రంలోని సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు చంద్రయాన్ 3 ల్యాండింగ్ పై ప్రత్యక్ష ప్రసారాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు వీక్షించేందుకు పాఠశాలలో విస్తృత ఏర్పాటు చేశారు. చందమామపై భారతకు చెందిన చంద్రయాన్ 3 అడుగుపెట్టిన వెంటనే విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు కేరింతలు కొడుతూ సంబరాలు జరుపుకున్నారు. జయహో భారత్ అంటూ బిగ్గరగా నినాదాలు చేశారు. చంద్రుని దక్షిణ ధ్రువానికి చేరిన మొదటి దేశం మనదైనందుకు గర్విస్తూ, ఇందుకు కృషి చేసిన శాస్త్రవేత్తలందరికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# చంద్రయాన్-3 విజయం దేశానికి గర్వకారణం



వీరబల్లి, ఆగస్టు 23 ప్రభాతవార్త

ప్రపంచ దేశాలలోనే ఎవరికి సాధ్యం కానీ చంద్రుని దక్షిణ ధ్రువంలో అడుగుపెట్టి మన సత్తా ఏమిటో ప్రపంచానికి తెలియజేసిన ఇస్రో శాస్త్రవేత్తలకి అభినందనలు అని మండల ఎంపీపీ గాలివీటి. రాజేంద్రనాథ్ రెడ్డి, నియోజకవర్గ వైసిపి నాయకుడు గాలివీటి. విజయసాగర్ రెడ్డి లు తెలిపారు. బుధవారం వారు స్వగృహంలో కార్యకర్తలతో కలిసి చంద్రయాన్ 3 ల్యాండింగ్ ను వీక్షించారు. సేఫ్ లాండింగ్ అవగానే అందరికీ అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలోనే సాంకేతిక రంగంలో మన దేశం ముందు వరుసలో ఉందన్నారు. ఎవరికి సాధ్యం కానీ దక్షిణ ధ్రువం పై కాలుమోపి మన సత్తా ఏమిటో ప్రపంచ దేశాలకు చాటి చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# ఇండియన్ గర్ల్స్ సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం

ప్రొద్దుటూరు, ఆగస్టు 23 ప్రభాతవార్త

ప్రొద్దుటూరుకు చెందిన లోక మహిపాల్ రెడ్డి సుకన్యల కుమారుడు హిమాన్స్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఇండియన్స్ గర్ల్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రొద్దుటూరు సేవా వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వికసిద్దా ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు పెళ్లిరోజులు వృధా ఖర్చు చేసుకోకుండా వృద్ధులకు అన్నదానం చేయడం మంచి పరిణామం అని అభినందించారు ఇండియన్ గర్ల్స్ సేవా సమితి సభ్యులు అందరూ కలిసి ఆంధ్ర తెలంగాణ రెండు రాష్ట్రాలలో మంచి సేవా కార్యక్రమాలు చేస్తున్న నేపథ్యంలో వారందరిని ప్రత్యేక అభినందనలు తెలిపారు.